# సాక్షి పల్నాడు

గురువారం । 20 । జూన్ । 2024






## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పిడుగురాళ్ల: మన్నెం పుల్లారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 504.50 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



## గోదాములో తనిఖీలు

తాడికొండ: తాడికొండ సివిల్ సప్లయీస్ గోదాములో బుధవారం లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ మాధురి తనిఖీలు నిర్వహించి, ప్యాకింగ్‌లో తేడాలు గుర్తించి కేసు నమోదు చేశారు.

## న్యూస్‌రీల్

### వసతి గృహంలో జేసీ ఆకస్మిక తనిఖీ



నరసరావుపేట రూరల్: లింగంగుంట్లలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలురకు కల్పిస్తున్న వసతి సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి స్టడీ అవర్స్‌లో సందేహాలను నివృతి చేసుకుంటున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వంటశాలను పరిశీలించారు. నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని తెలిపారు.

### పొగాకు రైతుల ఆత్మీయ సమ్మేళనం



కొండ(నూజెండ్ల): పట్టణంలోని గంగినేని ఫంక్షన్ హాల్‌లో గాడ్ ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో పొగాకు రైతుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ డీఎస్‌జే జితేందర్ మాట్లాడుతూ రానున్న మూడు సంవత్సరాల్లో పొగాకు పంటకు మంచి డిమాండ్ ఉందని, మంచి మద్దతు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. పొగాకు పంటపై తమ వ్యూహాలను తెలియజేస్తూ పొగాకును సరైన పద్ధతిలో పండించాలన్నారు. కంపెనీ జనరల్ మేనేజర్ ఎం.ప్రభాకర్‌రావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ వైఎస్ పాటిల్, సీనియర్ మేనేజర్ బి.ఎం.రవి, పి.కృష్ణప్రేమ్, జి.రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రీయ బాలపురస్కార్ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): భారత ప్రభుత్వం ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులు 2025 ప్రకటించిందని, ఈ అవార్డుల కోసం అర్హులైన బాలలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి ఉమాదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అసాధారణమైన ధైర్యసాహసాలతో నిస్వార్థమైన చర్యలకు, అత్యుత్తమ విజయాలు కలిగిన చిన్న పిల్లలకు తగిన గుర్తింపు ఇవ్వడానికి ఈ బాల పురస్కార్ దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇతరులకు ఆదర్శంగా, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సంస్కృతి, నూతన ఆవిష్కరణలు మొదలగు వాటిలో ప్రత్యేక నైపుణ్యం కలిగి ఉంటారో అటువంటి వారు జూలై 31వ తేది లోగా హెచ్‌టీటీపీఎస్://అవార్డ్స్.జీఓవీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 31 జూలై, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండవని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### తెనాలి ఐటీఐ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రారంభం



తెనాలిఅర్బన్: ఐటీఐ కళాశాలల ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను బుధవారం తెనాలి చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించారు. జిల్లా పరిధిలోని రెండు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలతోపాటు 10 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లోని సీట్లను భర్తీ చేశారు. మొత్తం 537 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో మెరిట్ సంఖ్య ఒకటి నుంచి 304 వరకు కౌన్సెలింగ్‌కు పిలిచారు. వీరికి సీట్లు కేటాయించారు. మిగిలిన సీట్లకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్, తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చినవెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిధిలోని వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

### నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.5300, మోడల్ ధర రూ.4600 వరకు పలికింది.

# పరిశోధనలకు అగ్రస్థానం

- వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు
- సేద్య విద్యలో ఎన్జీ రంగా వర్సిటీ ఘన ప్రస్థానం
- గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉద్ఘాటన
- ఉత్సాహంగా ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఎన్జీ రంగా వర్సిటీ వైస్ చాన్సలర్ శారదజయలక్ష్మీదేవి

బాపట్ల: వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులొస్తున్నాయని, పరిశోధనలకు అగ్రస్థానం లభిస్తోందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 56వ స్నాతకోత్సవం బుధవారం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గవర్నర్, వర్సిటీ కులపతి అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. తొలుత ఆయన ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన స్నాతకోత్సవంలో మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధి, గ్రామీణ జనాభా సంక్షేమంలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయ శక్తిగా భారత్ నిలుస్తోందని పేర్కొన్నారు. పాలు, పప్పులు, సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిలో మనం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నామని చెప్పారు. దేశంలో వ్యవసాయం రంగం తప్పుదోవ పడితే మిగతాదేదీ సరిగ్గా జరిగే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. దేశ ఆర్థికాభివృద్ధి, ప్రగతిలో సేద్య రంగం వాటా ఎక్కువన్నారు. స్థిరమైన వ్యవసాయం, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెట్ అనుసంధానాల కోసం సృజనాత్మకంగా ఆలోచించి వినూత్న పద్ధతిలో పరిష్కారాలను అభివృద్ధి చేయాలని గవర్నర్ సూచించారు. వ్యవసాయ రంగ భవిత విద్యార్థుల భుజాలపైనే ఉందని వివరించారు. పాడిపోషణ, గోధుమలు, బియ్యం, పత్తి సాగులో ఎక్కువ విస్తీర్ణం మన దేశంలోనే ఉందని, గోధుమలు, బియ్యం, పత్తి, చెరకు, చేపలు, గొర్రెలు ఉత్పత్తిలో మనది రెండో అతిపెద్ద దేశమని గవర్నర్ వెల్లడించారు. వ్యవసాయ పరిశోధనలకు ఎక్కువ ప్రాధాన్యం కల్పిస్తున్నామని చెప్పారు.

**1,576 మందికి పట్టాలు ప్రదానం**

స్నాతకోత్సవంలో 1,576 మంది విద్యార్థులు పట్టాలు స్వీకరిస్తే వీరిలో 1,319 అండర్ గ్రాడ్యుయేట్, 193 పోస్ట్ గ్రాడ్యుయేట్, 64 పీహెచ్‌డీ డిగ్రీ సర్టిఫికెట్లను అందుకున్నారు.



పీహెచ్‌డీ పత్రాలు ప్రదానం చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

**డాక్టర్ శరత్‌కుమార్‌కు ప్రతిష్టాత్మక అవార్డులు**

అగ్రికల్చరల్ సైన్సెస్‌ల అత్యుత్తమ పరిశోధనలకు డాక్టర్ ఎం.వి.రెడ్డి జాతీయ అవార్డు–2023, వి.రామచంద్రరావు జాతీయ పురస్కారం–2023ను డాక్టర్ శరత్ కుమార్‌కు అందించారు. ఈ రెండు అవార్డులూ ఒక్కరే కైవసం చేసుకోవడం విశేషం. స్నాతకోత్సవంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మిదేవి, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### గవర్నర్‌ను కలిసిన ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్లటౌన్: ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు బాపట్ల విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్‌ను వ్యవసాయ కళాశాల అతిథిగృహంలో ఎస్పీ వకుల్‌జిందాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను అందజేశారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు మొక్కను అందజేస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

## ఎన్నికల కేసుల్లో నిందితులను అరెస్టు చేయండి

సీఐలను ఆదేశించిన జిల్లా ఎస్పీ మలికా గార్గ్

నరసరావుపేట టౌన్: ఎన్నికల కేసులకు సంబంధించిన నిందితుల అరెస్టుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి వారిని పట్టుకొని రిమాండ్‌కు పంపాలని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆమె పట్టణంలోని రెండో పోలీసుస్టేషన్‌ను పరిశీలించారు. పరిసరాలను పరిశీలించి ఎఫ్ఐఆర్ ఇండెక్స్, సిబ్బంది పనితీరు, రికార్డులు, కేసుల డైరీలు, రిజిష్టర్లు, సీడీ ఫైల్స్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా సీఐలు, ఎస్ఐలతో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. పట్టణంలో రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రణాళికాబద్ధంగా త్వరితగతిన పూర్తిచేయాలని, నిందితులను అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చి చార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని, మహిళలు సంచరించే చీకటి ప్రాంతాలను గుర్తించి, బీట్లు పెంచి గస్తీ ముమ్మరం చేయాలన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. హోంగార్డులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు అందజేశారు. ఈసందర్భంగా బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాలకు చెందిన పలువురు హెడ్ కానిస్టేబుళ్లు ఆమెను కలిసి తమకు ప్రమోషన్లు రాలేదని విన్నవించగా త్వరలో పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వన్‌టౌన్ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి, టుటౌన్ సీఐ భాస్కర్, రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



టూటౌన్ పోలీసుస్టేషన్‌లో రిజిష్టర్లు తనిఖీ చేస్తున్న ఎస్పీ మలికా గార్గ్

**ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగస్వామ్యం కావాలి ..**

నరసరావుపేట: శాంతిభద్రతల పరిరక్షణలో గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులు భాగస్వామ్యం కావాలని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఆమె వీడియా కాన్ఫరెన్స్ ద్వారా మహిళా పోలీసులకు దిశా నిర్దేశం చేశారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింతగా చేరువకావాలని, సైబర్ నేరాలు, లోన్‌యాప్‌లపై అవగాహన పెంచుకోవాలన్నారు. అక్రమ మద్యం, ఇసుక, గంజాయి తదితర నిషేధిత పదార్థాల అక్రమ రవాణా, నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాలు, వార్డుల్లో మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో పోలీసులతో కలిసి పనిచేయాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్‌టచ్, ఫోక్సో కేసులపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో నూతన వ్యక్తుల సంచారంపై ఎస్‌హెచ్‌ఓలకు సమాచారం ఇవ్వాలని, సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులతో మాట్లాడాలన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## కలకలం రేపిన వృద్ధురాలి హత్య

వినుకొండలో పట్టపగలే దారుణం

వినుకొండ(నూజెండ్ల): ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంట్లోకి ప్రవేశించి, వృద్ధురాలిపై దాడి చేసి హత్య చేశారు. పట్టపగలే వినుకొండ పట్టణంలో బుధవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వినుకొండ టౌన్ సీఐ సాంబశివరావు తెలిపిన వివరాల ప్రకారం... ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వినుకొండ కొత్తపేట 6వ లైన్‌లో కొత్తపేట గీతాంజలి స్కూల్ ఎదురు బజారులో నివాసం ఉంటున్న పయార్థ కోటిరత్నం (75) ఇంటికి దొంగతనానికి వచ్చారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడం గమనించి ఇంట్లోకి ప్రవేశించారు. వారిలో ఒక యువకుడు కోటిరత్నం మెడలోని బంగారు ఆభరణాలు గుంజే ప్రయత్నం చేశాడు. వృద్ధురాలు పెనుగులాడటంతో హత్య చేసి, ఆభరణాలు వదిలేసి పరారైనట్లు సమాచారం. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతిచెందిన కోటిరత్నం

## పామాయిల్ ట్యాంకర్ బోల్తా



బోల్తాపడ్డ ట్యాంకర్ నుంచి ఆయిల్ కోసం ఎగబడుతున్న ప్రజలు



నాలుగు పొక్లెయిన్‌లతో ట్యాంకర్‌ను పైకి లేపుతున్న దృశ్యం

రాజుపాలెం: అతి వేగంతో వెళ్తున్న పామాయిల్ ట్యాంకర్ ముందు వాహనాన్ని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొని అవతల వైపు రోడ్డుపై బోల్తా పడింది. ఈ ఘటన పల్నాడు జిల్లా పెదనెమలిపురి గ్రామ మలుపు వద్ద అద్దంకి–నార్కెట్‌పల్లి రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కృష్ణలంక పోర్టులో 33,880 కిలోల రిఫైండ్ ఆయిల్‌ను ట్యాంకర్‌లో నింపుకొన్న ట్యాంకర్ హైదరాబాద్ వైపునకు వెళుతుంది. మార్గ మధ్యలో నెమలిపురి మలుపు వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని తప్పించబోయి డివైడర్‌కు ఢీకొని అవతల రోడ్డుపై బోల్తా పడింది. దీంతో గ్రామస్తులు గుంపులు గుంపులుగా వచ్చి బకెట్లతో ఆయిల్‌ను తీసుకెళ్లారు. మరికొంత ఆయిల్ నేలపాలయ్యింది. ఆ సమయంలో ఇరువైపుల కిలోమీటరు వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ కె.పుల్లారావు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని నాలుగు పొక్లెయిన్‌లను తీసుకొచ్చి ట్యాంకర్‌ను లేపి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అదేసమయంలో మరో ట్యాంకర్‌ను తీసుకొచ్చి ఆయిల్‌ను అందులోకి మార్చారు.

## లాంఫాం సందర్శన

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాన్ని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐకార్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాంశుపాఠక్ బుధవారం సందర్శించారు. నగర శివారుల్లోని లాంఫాంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ కాటన్ కార్యాలయాన్ని పరిశీలించారు. కాటన్ రీసెర్చ్ కార్యాలయం డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కే శుక్లా కార్యక్రమాల కార్యాచరణ, ప్రణాళికలను వివరించారు. కాటన్ క్వాలిటీ అనాలసిస్, ట్రాష్ టెస్టింగ్ సౌకర్యాలను పాఠక్ పరిశీలించారు. అనంతరం పాఠక్ మాట్లాడుతూ కంది, శనగలో అధిక దిగుబడిని ఇచ్చే రకాలను రూపొందించి ఎగుమతులు పెంచే దిశగా కృషి చేయాలని సూచించారు. ఏఐసీఆర్‌పీ సెంటర్లలో పనిచేస్తున్న శాస్త్రవేత్తల సమస్యలు తెలుసుకున్నారు. శాస్త్రవేత్తలు వివిధ స్కీంల ద్వారా జరుపుతున్న పరిశోధనల ప్రగతిని తెలుసుకుని వారికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జాతీయ పొగాకు పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్, ఐకార్ క్వాలిటీ ఇవాల్యుయేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ డివిజన్ ప్రతినిధి డాక్టర్ ఏఎస్ఎమ్ రాజా, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పి.సత్యనారాయణ, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ దుర్గాప్రసాద్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



లాంఫాం శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న ఐకార్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాంశుపాఠక్

## వైభవంగా జగన్నాథస్వామి బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): కొత్తపేటలోని జగన్నాథస్వామి దేవస్థానంలో రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజు బుధవారం వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. పూర్ణాహుతి జరిపించారు. ధ్వజారోహణ చేపట్టారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. జగన్నాథ, అంజనేయ, వేంకటేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్ (ఈఓ) డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్వామికి చక్రస్నానం

# కౌలు కోలా‘హలం’

- డెల్టాలో మాగాణి భూములకు గిరాకీ
- భూమి ఉందంటే క్యూ కడుతున్న కౌలు రైతులు
- ఎకరాకు రూ.2వేల నుంచి రూ.10 వేల వరకు అదనంగా చెల్లించేందుకూ సిద్ధం
- గత సీజనులో పంటల ‘ధర’హాసమే కారణం



తెనాలి: డెల్టాలో కౌలు ధరలకు రెక్కలొచ్చాయి. మాగాణి భూముల కౌలుకు గిరాకీ ఏర్పడింది. ఎక్కడ భూమి ఉందన్నా తీసుకునేందుకు కౌలు రైతులు సంసిద్ధం అంటున్నారు. ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు కౌలు ధర అధికంగా చెల్లించేందుకూ ముందుకొస్తున్నారు. గతేడాది ధాన్యం నుంచి జొన్న, మొక్కజొన్న సహా పంటలకు మంచి ధరలు రావటమే ఇందుకు కారణమని రైతులు చెబుతున్నారు.

**25 బస్తాలకు తగ్గకుండా కౌలు**

డెల్టాలో ఖరీఫ్ సీజన్‌కు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. దుక్కులు దున్నుతూ భూమిని సిద్ధం చేస్తున్నారు. రుతుపవనాలూ సకాలంలో వచ్చేశాయి. వానలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కృష్ణా పశ్చిమడెల్టాలో మాగాణి భూముల కౌలు ఒప్పందాలు ఊపందుకున్నాయి. గత రెండు మూడేళ్లుగా స్థిరంగా ఉన్న కౌలు ధరలు 2024–25 సంవత్సరానికి భారీగా పెరిగాయి. తెనాలి, పరిసరాల్లో ఎకరాకు రూ.29 వేల నుంచి రూ.31 వేలుగా ఉన్న కౌలు ధర, ఈ ఏడాది రూ.32 వేల నుంచి రూ.37 వేల వరకు పలుకుతోందంటే ఆశ్చర్యపోనవసరం లేదు. ధాన్యం బస్తాల కౌలు ఎక్కడా 25 బస్తాలకు తక్కువగా లేదు. ఈ పర్యాయం 27 బస్తాల ధాన్యం చెల్లించేలా ఎక్కువగా కౌలు ఒప్పందాలు జరుగుతున్నాయి. కృష్ణానదీ తీరంలోని కొల్లిపర మండలంలో గతేడాది ఎకరం మాగాణి భూమి కౌలు ధర రూ.25 వేల నుంచి రూ.28 వేలుగా నడిచింది. రోడ్డుకు లోపలున్న భూమికి కౌలు రూ.25 వేల నుంచి రూ.26 వేలుగా ఉంటే, కరెంటు మోటారు ఉండి, రోడ్డు లేదా డొంకకు ఆనుకుని ఉన్న భూముల్లో రూ.27 వేల నుంచి రూ.28 వేల వరకు చెల్లించారు. ఈసారి లోపలగా ఉన్న భూములకు కౌలు రూ.32 వేల వరకు పలికితే, రోడ్డుపక్కన, కరెంటు మోటారున్న చేలకు రూ.35 వేల నుంచి రూ.36 వేల కౌలు చెల్లించేందుకు రైతులు వెనుకాడటం లేదు.

**పొరుగు గ్రామాల్లోనూ సాగుకు ఆసక్తి**

పశ్చిమడెల్టా పరిధిలోని వేమూరు నియోజకవర్గం గ్రామాల్లో కౌలు రేట్లు బాగానే పెరిగాయని రైతులు చెబుతున్నారు. గత సంవత్సరం పంట చేతికొచ్చే సమయంలో వచ్చిన మిచాంగ్ తుఫాన్ కారణంగా పంట బాగా నష్టపోయిన కౌలురైతులు ఎక్కువ మంది ధాన్యం కౌలును తగ్గించి ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చే పంట నష్టపరిహారాన్ని భూమి యజమానులైన రైతులను తీసుకొమ్మని చెప్పారు. అయినా సరే, ఆ నియోజకవర్గంలోని వేమూరు, అమృతలూరు మండలాల్లోని కౌలురైతులు ఈ ఏడాది కౌలు ధరలను పెంచి మరీ ఒప్పందాలను చేసుకుంటున్నారు. సాగునీటి వెసులుబాటు ఆధారంగా రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు అదనంగా కౌలు ఒప్పందాలు జరుగుతున్నట్టు చెబుతున్నారు. ఒక గ్రామంలోని కౌలురైతులు, అక్కడి భూములనే కాకుండా పొరుగు గ్రామాల్లోని భూములనూ కౌలుకు తీసుకునేందుకు పోటీపడుతుండటం మరో విశేషం!

**గత ఏడాది మంచి లాభాలు**

కౌలు ధరలకు రెక్కలు రావటానికి ప్రధాన కారణం గతేడాది పండించిన పంటలకు మార్కెట్లో మంచి ధరలు పలకటమే. జిల్లాలో మాగాణి భూమి విస్తీర్ణం 1,52,411 ఎకరాలు కాగా, అందులో 1.37 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుచేశారు. ఇందులో అధికశాతం పశ్చిమడెల్టా పరిధిలోని ఉమ్మడి తెనాలి డివిజన్‌లోనే ఉంది. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్నా, ఎకరాకు 35 నుంచి 40 బస్తాల దిగుబడి వచ్చింది. ఎన్నడూ లేనివిధంగా కల్లాల్లోనే 75 కిలోల ధాన్యం బస్తాను రూ.1,900 నుంచి రూ.2,100 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. రబీలో వేసిన మొక్కజొన్న ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి రాగా, క్వింటాలు రూ.2,000 నుంచి రూ.2,200 వరకు రైతులు అమ్ముకోగలిగారు. దీంతోపాటు వేసిన తెల్లజొన్న ఎకరాకు 25–30 క్వింటాళ్ల దిగుబడి రాగా, క్వింటాలు రూ.2000 పైగానే విక్రయాలు జరిగాయి. పంటల ధరలు బాగున్నందునే ఈ ఏడాది మాగాణి భూముల కౌలు ధరలు పెరిగాయి.

**ప్రత్యేక రుణ ప్రణాళిక ఇవ్వాలి**

గత సంవత్సరం కంటే ఈ ఏడాది కౌలు ధరలు పెరిగాయి. కొత్తగా కౌలుకు తీసుకునేవారు ఎక్కువయ్యారు. దీంతో కౌలు రైతుల సంఖ్య పెరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వం కౌలు రైతులకు పత్యేక రుణ ప్రణాళికను అమలు చేయాలి. గుర్తింపు కార్డులను, సబ్సిడీలను ఇవ్వాలి.

– ములకా శివసాంబిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు, ఏపీ రైతు సంఘం

**పసుపునకూ కౌలు ధరహాసం**

మెట్ట భూముల్లో పండించే పంటల్లో ప్రధానమైన పసుపునకు ఈ ఏడాది రికార్డుస్థాయి ధరలు పలకటం మరో విశేషం. ఫలితంగా మెట్టభూముల కౌలు ధర కూడా ఎక్కువగా ఉందంటున్నారు. మరోవైపు తెనాలి ప్రాంతంలో పండించే నిమ్మకాయలకూ ఈసారి ధరలు బాగున్న విషయం తెలిసిందే. దీనితో రెండురోజుల్లో వచ్చే ఏరువాక తర్వాత నిమ్మ తోటల కౌలు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. ఇవి కూడా పెరుగుతాయనే అంచనాలో రైతులు ఉన్నారు.

## తెనాలిలో 84.8 మి.మీ. వర్షం

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు వర్షం కురిసింది. అత్యధికంగా తెనాలి మండలంలో 84.8 మిల్లీమీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా మంగళగిరి మండలంలో 1 మి.మీ. వాన కురిసింది. సగటున 10.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా చేబ్రోలు మండలంలో 37 మి.మీ., పొన్నూరు 27.8, పెదనందిపాడు 21.2, తాడేపల్లి 16.6, వట్టిచెరుకూరు 3.6, దుగ్గిరాల 1.8, గుంటూరు తూర్పు 1.8, కొల్లిపర మండలంలో 1.4 మి.మీ చొప్పున వర్షం పడింది. జూన్ 19వ తేదీ నాటికి సాధారణ వర్షపాతం 61.5 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 83.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.



## క్లుప్తంగా

### 'సికిల్ సెల్ ఎనీమియా'పై అవగాహన అవసరం

ఎమ్మెల్యే వేగేశన



**బాపట్ల:** సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు పేర్కొన్నారు. వైద్య, గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో స్థానిక స్పందన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోస్టర్లను ఆవిష్కరించారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి గిరిజనుల్లో ఎక్కువగా వస్తోందని ఎమ్మెల్యే వేగేశన పేర్కొన్నారు. రక్తకణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడం కష్టం వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. 40 సంవత్సరాలు నిండిన వారికి పరీక్షలు చేయించి, వ్యాధి నివారణకు మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టరు విజయమ్మ, అధికారులు ఫణిదూద్‌శెట్టి, డాక్టరు టి.వెంకటేశ్వర్లు, సౌజన్య పాల్గొన్నారు.

### రక్తదాత పి.వి.సురేష్‌బాబుకు సత్కారం



**వినుకొండ(నూజెండ్ల):** ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 83 సార్లు రక్తదానం చేసిన పి.వి.సురేష్‌బాబును సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ రక్తదానం చేసి ఒకరి ప్రాణం కాపాడటం ఎంతోగొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ భువనగిరి సుబ్రహ్మణ్యం, సెక్రటరీ కాల కృష్ణమూర్తి, ట్రెజరర్ కోటేశ్వరరావు, నాగేంద్రుడు, వెంకటేశ్వర్లు, సీహెచ్ రఘు, దీక్షితులు, రమేష్, శంకరరావు, పి.వి.సుబ్బారావు, ఎ.రామలింగేశ్వరరావు, ఎం.వి.శర్మ ఆదిరాములు, దుబ్బల దాసు తదితరులు పాల్గొన్నారు.

### 23 వరకు యోగ దినోత్సవ కార్యక్రమాలు



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్‌ఓసీ శ్రీనివాసరావు, వేదికపై వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయకులు

**ఏఎన్‌యూ:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో భారత్ స్కౌట్స్, గైడ్స్ ఆధ్వర్యంలో ఈనెల 21న అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఎస్‌ఓసీ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 23 వరకు సదరన్ రీజియన్ స్థాయి యోగ, ఆహార నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమం జరుగుతోందన్నారు. మొదటి రోజు కార్యక్రమాలు సుదర్శన్ భవన్, యోగా, మెడిటేషన్ సెంటర్, ఫ్లాగ్ సెర్మని, ప్రారంభ సమావేశం ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో తమిళనాడు, కేరళ, తెలంగాణ, గోవా, ఆంధ్రప్రదేశ్, అండమాన్ కర్నాటక, సదరన్ రైల్వే విభాగం నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి వేంకటేశ్వర రావు, సదరన్ డైరెక్టర్ కుముద్ మెహరా, స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఎస్‌ఓసీ శ్రీనివాసరావు, స్కౌట్స్, గైడ్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# జానపద కళలకు ప్రోత్సాహం అవసరం

నెహ్రూ యువకేంద్రం, జిల్లా యువ అధికారి దేవిరెడ్డి కిరణ్మయి



కళాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కిరణ్మయి

**పెదకూరపాడు:** సాంప్రదాయ జానపద కళలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని నెహ్రూ యువ కేంద్రం, జిల్లా యువ అధికారి దేవిరెడ్డి కిరణ్మయి అన్నారు. పెదకూరపాడులోని జనచైతన్య సమితి ఆధ్వర్యంలో సంస్థ కార్యదర్శి, కోలాటం శిక్షకులు తుళ్లూరు సాంబశివరావు నేతృత్వంలో నిర్వహించిన ఉచిత వేసవి కోలాటం శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కిరణ్మయి మాట్లాడుతూ దశాబ్దాలు గడిచినా కోలాటానికి ఆదరణ తగ్గలేదన్నారు. ప్రతి వేడుకల్లో కోలాటం అంతర్భాగం అవుతోందన్నారు. యువత పెద్దఎత్తున శిక్షణ తీసుకుని ప్రదర్శించిన తీరు అద్భుతంగా ఉందన్నారు. జనచైతన్య సమితి సాంప్రదాయ జానపద కళలకు ఊపిరి పోస్తుందని అభినందించారు. తహసీల్దార్ ప్రభాకరరావు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఇటువంటి కళలను ప్రోత్సహించాలన్నారు. మానసిక, శారీరక ధృడత్వం కోలాటం ద్వారా చేకూరుతోందన్నారు. కాకతీయ విద్యా సంస్థల అధినేత సాంబశివరావు మాట్లాడుతూ గతంలో తోలుబొమ్మలాట ఉండేదని, నేడు ఆ కళలు కనమరుగు అయ్యాయన్నారు. కోలాటం అనేది అద్భుతమైన జానపద కళారూపం అన్నారు. శిక్షణలో పాల్గొన్న కళాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి జనచైతన్య సమితి కో–ఆర్డినేటర్ అనిల్‌కుమార్ అధ్యక్షత వహించారు. కోలాటం మాస్టారు సాంబశివరావును సత్కరించారు. కార్యక్రమంలో జనచైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి విజయ్ బెంజిబాబు, ప్రభుత్వ కళాకారులు కొర్రపాటి వెంకటేశ్వర్లు, గుడిపూడి బ్రహ్మానాయుడు పాల్గొన్నారు.



కోలాట ప్రదర్శన చేస్తున్న కళాకారులు

# అదనపు పొగాకుకు అపరాధ రుసుం ఎత్తివేయాలి



పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ శ్రీధర్‌బాబులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

- జంగారెడ్డిగూడెంలో కమ్యూనిటీ హాలు నిర్మించండి
- పొగాకు బోర్డు రథసారథులకు రైతు సంఘాల వినతి

**కొరిటెపాడు(గుంటూరు):** అదనపు పొగాకు పంటపై అపరాధ రుసుం ఎత్తివేయాలని కోరుతూ ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని ఐదు పొగాకు వేలం కేంద్రాల రైతు సంఘాల ప్రతినిధులు బుధవారం గుంటూరు జీటీ రోడ్‌లోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేలం కేంద్రాల రైతు ప్రతినిధులు మాట్లాడుతూ అదనంగా పండించిన పొగాకు పంటకు అపరాధ రుసుం లేకుండా అమ్ముకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. జంగారెడ్డి గూడెంలోని రెండు వేలం కేంద్రాలకు ఒక కమ్యూనిటీ హాలు నిర్మించాలని సూచించారు. స్పందించిన పొగాకు బోర్డు చైర్మన్, ఈడీలు చిడిపోతు యశ్వంత్ కుమార్, అద్దంకి శ్రీధర్ బాబులు మాట్లాడుతూ అపరాధ రుసుంపై ఇప్పటికే ఢిల్లీలోని వాణిజ్య శాఖకు సిఫార్సు చేయడం జరిగిందని వెల్లడించారు. అనంతరం ప్రస్తుతం జరుగుతున్న వేలం విధానంపై చర్చించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఐదు వేలం కేంద్రాల రైతు సంఘాల నాయకులు సత్రం వెంకట్రావు, వీవీఎస్ ప్రకాశరావు, అట్లూరి సతీష్, గూడూరి నాగరాజు, పెండ్యాల ప్రసాద్, పరిమి రాంబాబు, కరాటం రెడ్డిబాబు, కూచిపూడి రమేష్, కాకర్ల వివేకానంద, అడపా సత్యనారాయణ, ఇల్లూరి రాంబాబు, గద్దె శేషగిరిరావు, పిన్నమనేని మధుమోహన్ తదితరులున్నారు.

## విత్తన షాపుల్లో విజిలెన్స్ దాడులు



మర్రిపాలెం విత్తన షాపులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

**బొల్లాపల్లి:** మండలంలోని మర్రిపాలెం గ్రామంలో విత్తన షాపులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. అనుమతి లేకుండా విత్తనాలు అమ్మకాలు జరుపుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామని ఆ శాఖాధికారులు తెలిపారు. దాడుల్లో హనుమాన్ సీడ్స్ షాపులో తనిఖీలు చేసి, స్టాప్ సెల్స్ చేశామని చెప్పారు. 1983 విత్తన చట్టం ప్రకారం ఎటువంటి పత్రాలు, ఆధారాలు లేకుండా అమ్మకాలు చేస్తున్న రూ6.94 లక్షల విలువ గల పది కిలోల విత్తనాలు నిలుపుదల చేశామన్నారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు ఎ.శ్రీహరిరావు, కె.రమణకుమార్, ఎం.రామచంద్రయ్య, స్థానిక వ్యవసాయాధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాలం చెల్లిన వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు

బాపట్ల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి దేవరాజ్



పట్టణంలోని మార్ట్‌లో తనిఖీలు చేస్తున్న దేవరాజ్

**బాపట్ల టౌన్:** కాలం చెల్లిన వస్తువుల్ని విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి దేవరాజ్ తెలిపారు. పట్టణంలోని టీఎస్ఎన్ మార్ట్‌లో కాలం చెల్లిన వస్తువులు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో బుధవారం ఆయన తనిఖీ చేశారు. సుమారు గంటకు పైగా అన్ని వస్తువులను పరిశీలించారు. 2023 డిసెంబర్ 15 తయారైన సోంపాపిడి ఈనెల 14తో కాలం చెల్లినప్పటికీ విక్రయిస్తూనే ఉండటాన్ని గమనించారు. కాలం చెల్లిన వస్తువుల్ని వెంటనే చెత్తలో పారేయాలని, లేనిపక్షంలో షాపును సీజ్ చేస్తామని హెచ్చరించారు. కాలం చెల్లిన వస్తువుల విక్రయం వల్ల వినియోగదారులు అనారోగ్యం పాలవుతారని తెలిపారు. ముస్ముందు ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని మార్ట్‌నిర్వాహకుల్ని హెచ్చరించారు.

## నేల బావిలో పడి మతిస్థిమితం లేని యువకుడు మృతి



**సత్తెనపల్లి:** మతిస్థిమితం లేని యువకుడు నేల బావిలో పడి మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం కట్టమూరు శివారులో బుధవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సత్తెనపల్లి మండలం కట్టమూరు శివారులోని నేల బావిలో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు సత్తెనపల్లి రూరల్ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీయించారు. కాగా మృతుడు సత్తెనపల్లి మండలం బట్లూరుకు చెందిన మతిస్థిమితం లేని దాసరి ఏసుబాబు (22)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం ఏసుబాబు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## వైఎస్సార్ సీపీ వర్గీయులపై టీడీపీ నేతల దాడి

**నరసరావుపేట:** పల్నాడు జిల్లా మాచర్లలో వైఎస్సార్ సీపీ వర్గీయులపై టీడీపీ శ్రేణులు బుధవారం రాత్రి దాడి చేశారు. ఈ ఘటనలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి చెందిన ఇంటి పనివాళ్లకు గాయాలయ్యాయి. దాడిలో కోటా సెల్వమ్మ, గురవమ్మలకు తీవ్రగాయాలు కాగా, సెల్వమ్మ కుమారులు కోటా రాజేష్, శివకుమార్‌లు కూడా గాయపడ్డారు. వీరంతా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. మరో వైపు ఆప్రాంతంలో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్న వారి ఇంటిని ధ్వంసం చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి ధ్వంసం చేసిన టీడీపీ నేతలను చెల్లాచెదురు చేశారు. కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకులు మా ఇష్టమంటూ పోలీసుకు ఎదురు తిరిగి మాట్లాడారు. ఈ నేపథ్యంలో సీఐ బ్రహ్మయ్య వివాదం తాత్కాలికంగా సద్దుమణిగేలా చేశారు.

## శతాధిక వృద్ధుడు మృతి



గద్దం దావీదు(ఫైల్)

**చిలకలూరిపేటటౌన్:** మండలంలోని వేలూరు గ్రామంలో శతాధిక వృద్ధుడు గద్దం దావీదు(103) మంగళవారం సాయంత్రం కన్ను మూశారు. 1922లో జన్మించిన దావీదు రెండేళ్ల క్రితం వేలూరులోని లూథరన్ చర్చిలో తన వందో పుట్టిన రోజును ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఇటీవలనే ఆయన తన 103వ పుట్టిన రోజు జరుపుకొన్నట్టు కుమారులు గద్దం ఏలీయా, గద్దం మోషే తెలిపారు. వందేళ్లు దాటినా ఎంతో ఆరోగ్యంగా ఉంటూ తన పనులు తాను చేసుకునే గద్దం దావీదు మంగళవారం సాయంత్రం తానే స్వయంగా స్నానం చేసి వచ్చి మంచంపై పడుకుని నిద్రలోనే తుది శ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నియోజక పరిధిలోని పలువురు క్రైస్తవులు వచ్చి భౌతిక కాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

## పిల్లలు బడిలోనే ఉండాలి

చర్యలు తీసుకోవాలంటూ ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి ఆదేశం




బదిలీపై వెళ్లిన డిప్యూటీ డీఈఓ నిర్మలను సన్మానిస్తున్న ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి

**తెనాలిఅర్బన్:** బడి ఈడు పిల్లలను బడిలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ గుంటూరు రీజనల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వరరెడ్డి ఆదేశించారు. బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లిషు మీడియం స్కూల్లో తెనాలి డివిజన్ పరిధిలో మండల విద్యాధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో డ్రాప్ అవుట్‌లు లేకుండా చూడాలన్నారు. పాఠశాలల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అడ్మిషన్‌ల ప్రక్రియ వేగవంతం చేయాలని, స్టూడెంట్ కిట్స్‌ను అందరికీ పంపిణీ చేయాలని తెలిపారు. మధ్యాహ్నం భోజనం, శానిటేషన్ పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం డిప్యూటీ డీఈవోగా పదవి బాధ్యతలు స్వీకరించిన జి.శాంతకుమారిని అందరికీ పరిచయం చేశారు. డిప్యూటీ డీఈవోగా బదిలీపై పర్చూరు వెళ్లిన ఎం.నిర్మల, పదవీ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయులు జి.రంగారావు, బి.శ్రీనివాసరావు, వి.శాంతకుమారి, టి.చంద్రశేఖర్, జి.లలితా ప్రసాద్‌లను సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో పి.శైలజ, డిప్యూటీ డీఈవో జి.శాంతకుమార్, ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, జయంతి బాబు, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు పాల్గొన్నారు.

## చేబ్రోలులో అనుమతిలేని వరి విత్తనాలు స్వాధీనం

గోడౌన్‌లో నిల్వ చేసిన 200 బస్తాలు సీజ్



గోడౌన్‌లో నిల్వ చేసిన విత్తనాలను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ సీఐ ఎ.శ్రీహరిరావు

**చేబ్రోలు:** వ్యవసాయ శాఖ అనుమతులు లేకుండా నిల్వ చేసిన వరి విత్తనాలను గుంటూరు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడి చేసి సీజ్ చేశారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వర రావు పర్యవేక్షణలో విజిలెన్స్ వ్యవసాయ శాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో చేబ్రోలులోని విత్తన షాపులను తనిఖీలు నిర్వహించారు. స్థానిక రాధా ఎంటర్ ప్రైజెస్ యజమాని గోపిశెట్టి శ్రీనివాస్ జీబీసీ మెయిన్ రోడ్డులోని వేణు ఇంటి వెనుక ఉన్న గోడౌన్ అద్దెకు తీసుకొని అక్రమంగా వరి విత్తనాలు నిల్వ చేసినట్లు గుర్తించారు. అధికారుల బృందం నిర్వహించిన దాడిలో అనుమతులు లేని గోడౌన్‌లో 200 బస్తాల వరి విత్తనాలు సుమారు నాలుగు లక్షల విలువగల విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ ఎ.శ్రీహరి రావు, వ్యవసాయశాఖాధికారి శ్రీనివాస నాయక్, సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు.

# దాడులతో కాదు అభివృద్ధితో జయించాలి

వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



నాయకులతో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

**పొన్నూరు:** అధికారాన్ని దక్కించుకున్న వారు అభివృద్ధితో ప్రజల మనసులను చూరగొనాలని, దాడులతో కాదని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ ఆస్తులను ధ్వంసం చేస్తూ రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పాల్పడటం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటములు సహజమని అధికారంలోకి వచ్చిన వారు అందరికీ మంచి చేస్తూ ముందుకు సాగాలన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం విచ్చలవిడిగా సాగుతున్న హింసాకాండకు అడ్డుకట్ట వేయాల్సిన పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ప్రజలకు వైఎస్సార్ సీపీ శ్రేణులు అనునిత్యం అండగా ఉంటారని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, షేక్ నాజర్, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 65 వేల కార్డుల లక్ష్యం తగదు

- జిల్లాలో లక్ష మందిపైగా కౌలు రైతులు
- కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ



**నరసరావుపేట:** కౌలుకు సాగుచేయడమే ప్రామాణికంగా తీసుకొని దరఖాస్తు చేసుకున్న ప్రతి కౌలు రైతుకి గుర్తింపు కార్డు మంజూరు చేసి రాయితీపై రుణాలు, విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లాలో సాగుదారులలో లక్ష మందికి పైగా కౌలు రైతులు ఉంటే జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు 65 వేల కార్డులు మంజూరు చేయనున్నట్లు లక్ష్యం నిర్దేశించడాన్ని కౌలు రైతు సంఘం వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. సాగుకు సంబంధించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కౌలురైతులకు అందడంలేదని, భూమి ఆధారంగానే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. దీంతో సాగులో లేని భూ యజమానులకే లబ్ధిచేకూరుతుందన్నారు. వాస్తవ సాగులో ఉన్న కౌలు రైతులకు ప్రభుత్వ సంక్షేమం, పంట గిట్టుబాటు ధర దక్కక ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నారన్నారు. పంట పెట్టుబడి సాయం, వడ్డీ రాయితీతో కూడిన పంటరుణాలు, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందడం లేదన్నారు. పంట నష్టం, బీమా పరిహారం రావడం లేదని, చివరకు కౌలు రైతులు సాగు చేస్తున్న పంటను ఈ–క్రాప్‌లో నమోదు చేయడంలేదన్నారు. పంటను ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధరకు మార్కెట్‌యార్డ్ ద్వారా అమ్ముకునే అవకాశం ఉండడం లేదన్నారు.

## టైరు పేలడంతో అదుపు తప్పిన ఆటో

- ఒకరి మృతి
- ఇద్దరి పరిస్థితి విషమం



ప్రమాదంలో మృతి చెందిన చిన్న మస్తాన్

**చీరాల:** వేగంగా వెళుతున్న ఆటో టైరు పేలడంతో అదుపు తప్పిన బోల్తా పడిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చీరాల– వాడరేవు రోడ్డులో చోటు చేసుకుంది. వివరాలు.. చీరాల నుంచి వాడరేవుకు వెళుతున్న ఆటో టైరు బుర్లవారిపాలెం సమీపంలో ఒక్కసారిగా పేలింది. అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గోడకు బలంగా ఢీకొనడంతో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వాడరేవుకు చెందిన కొక్కిలిగడ్డ చిన్న మస్తాన్ అనే వృద్ధుడు మృతి చెందాడు. మిగతా వారికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితుల్ని చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు వివరాలను నమోదు చేసుకున్నారు.

## సముద్రంలో గల్లంతైన ఆరుగురిని కాపాడిన పోలీసులు

తక్షణమే స్పందించిన గజ ఈతగాళ్లు



సముద్రంలో గల్లంతైన యువకులను కాపాడిన పోలీసులు, గజ ఈతగాళ్లు

**బాపట్లటౌన్:** సముద్రంలో స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి బుధవారం వేర్వేరు ఘటనల్లో ఆరుగురు యువకులు సముద్రంలో గల్లంతయ్యారు. తీరంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు, గజ ఈతగాళ్లు వెంటనే గమనించి తక్షణమే సముద్రంలోకి దూకి ఆరుగురిని కాపాడారు. వివరాల్లోకి వెళితే గుంటూరు పట్టణానికి చెందిన విష్ణుశెట్టి రామకృష్ణ, బాపట్ల పట్టణంలోని రైలుపేట ప్రాంతానికి చెందిన షేక్ సిద్దు, వూసా మణికంఠ, కర్లపాలెం మండలం ఎంవీ రాజుపాలెం గ్రామానికి చెందిన అట్ల వెంకటేశ్వర రెడ్డి, ఝూర్ఖండ్ రాష్ట్రానికి చెందిన రాజ్ కుమార్ యాదవ్, బిన్ యాదవ్‌లు బుధవారం సముద్రంలో మునిగి అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోతుండగా సూర్యలంక సముద్రతీరంలో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మస్తాన్ రావు, కానిస్టేబుల్ ఎస్.నాగరాజు, హోంగార్డులు కె.నాగరాజు, కె.ఆశీర్వాదంతో పాటు గజఈతగాళ్లు కె.సుబ్బారావు, కె.సత్య నారాయణ, కె.నాగేశ్వరరావు, ఎస్.శివ గోపాల్, కె.రామకృష్ణలు వెంటనే సముద్రంలోకి వెళ్లి సముద్రం నీటిలో కొట్టుకుపోతున్న ఆరుగురిని కాపాడి తీరానికి చేర్చారు. వీరికి తీరం వెంబడి ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. తక్షణమే స్పందించి ఆరుగురి ప్రాణాలు కాపాడిన పోలీసులు, గజ ఈతగాళ్లను ఎస్పీ వకుల్‌జిందాల్ అభినందించారు.

## సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలనే లక్ష్యం

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** సికిల్ సెల్ ఎనీమియా డేను పురస్కరించుకుని బుధవారం ప్రభుత్వాస్పత్రిలోని పుష్కర హాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. సికిల్ సెల్ ఎనిమియాను దేశ వ్యాప్తంగా 2047 నాటికి నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. అందులో భాగంగా ఆ వ్యాధి లక్షణాలపై అధికారులు అవగాహన కలిగిస్తున్నారు. రక్తహీనత, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్లనొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరచుగా వచ్చే అంటువ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు, అవయవాల వైఫల్యం ఈ వ్యాధి లక్షణాలుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ–సీడీ అధికారిణి డాక్టర్ మాధవి, డాక్టర్ ఆషా పర్వీన్, డాక్టర్ విజయ, డాక్టర్ వాసంతి తదితరులు పాల్గొన్నారు.